క్లుప్తంగా

నూతన ఏసీపీగా సదానందం


సీపీ అనురాధకు మొక్క అందజేస్తున్న సదానందం

సిద్దిపేటకమాన్: హుస్నాబాద్ డివిజన్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సదానందం కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి


కేక్ కట్‌చేస్తున్న వైద్య సిబ్బంది

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతున్న వారికి నర్సులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ రాము అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిస్వార్థంతో సేవలందిస్తుంటారని కొనియాడారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు మంజుల, అనిత, సూర్యప్రకాశ్, నర్సింగ్ సూపరింటిండెంట్ స్వరూపరాణి, సువర్ణ, ఫార్మాసిస్ట్ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలు అయ్యాయి. ఈ సిద్దిపేట పట్టణ శివారులో సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణ శివారు రాజీవ్ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుడి చేతి పై లవ్ సింబల్ టాటూ ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తు పడితే టూటౌన్ పోలీసులను 8712667314 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న తహసీల్దార్

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండాలో సీసీ పనులను తహసీల్దార్ మధుసూదన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షకాలంలో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారని ఈ రోడ్డు నిర్మాణంతో సమస్య పరిష్కరం అవుతుందన్నారు.

యాదవ ఉద్యోగుల నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా యాదవ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బైరి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సందేబోయిన రాజు, ఆర్థిక కార్యదర్శిగా ఉండ్రాళ్ళ రాజేశం, ఉపాధ్యక్షులుగా బత్తుల రాములు, కార్యవర్గ సభ్యులుగా బాల్ నర్సయ్య, చంద్రశేఖర్, దాసరి రాజు తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

మర్కూక్(గజ్వేల్): క్రీడల్లో గెలుపోటములు సహజమని, గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను కనబరిచి రాణించాలని బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య సూచించారు. ఎర్రవల్లిలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారుల కోసం రూ.4 వేలు అందజేశారు. మండల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు చెన్‌రాజు కృష్ణ, కుమార్ యాదవ్, స్వామి, రమేశ్, సలీం, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిద్రలో నిఘా నేత్రాలు

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం అంటూ పోలీసు అధికారులు చాలా చోట్ల ఏర్పాటు చేయించారు. కాని అది ఆచరణలో విఫలమైంది. దీంతో నిఘా వ్యవస్థ అస్తవ్యస్తమై నేరస్తులు తప్పించుకుంటున్నారు. వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- వారం రోజుల్లో పలుచోట్ల చోరీలు
- పర్యవేక్షించని పోలీసులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



రామవరంలో పనిచేయని సీసీ కెమెరాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో చోరీలు.. నేరాల సంఖ్యను తగ్గించాలని గతంలో ఆగ మేఘాల మీద ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు(సీసీ కెమెరాలు) నామ్‌కే వాస్తేగా మారాయి. మారుమూల పల్లెలు, గ్రామాలలో వాటిని ఏర్పాటు చేశారు. పోలీసుల ప్రోద్బలంతో మండలంలో షాపుల యజమానులు, నాయకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాని ఈ కెమెరాల వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా మూలన పడింది. దీంతో నాయకులు, కొందరు దాతలు చేసిన సహకారమంతా బూడిదలోపోసిన పన్నీరైంది.

వరుసగా చోరీలు

మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీల ఘటనలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని మొత్తం 37 గ్రామాలు ఉండగా దాదాపు 167 సీసీ కెమెరాలకుపైగా ఉన్నాయి. అందులో ఏ కెమెరా కూడా పనిచేయడం లేదు. దీంతో మండలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. 5వ తేదీన రామవరంలో పలు రైతులకు చెందిన ట్రాక్టర్లకు ఏర్పాటు చేసుకున్న సౌండ్ బాక్స్‌లను దొంగలించారు. వాటి విలువ సుమారుగా రూ.25 వేల వరకు ఉంటుంది. అలాగే ట్రాక్టర్లలో పోసిన డీజిల్ సైతం దొంగలిండంతో రైతులు అవాక్కవుతున్నారు. దీంతో ఎవరింట్లో, ఏ షాపులో ఎప్పుడు దొంగలు పడతారోనని జనాలు భయాందోళనలకు గురవుతున్నారు. కానీ పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి గస్తీ నిర్వహించి దొంగల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

చీకటి పడితే భయమే..

గ్రామంలో దొంగల బెడద ఎక్కువైంది. ఎప్పుడు ఎవరింట్లో దొంగలు పడతారోనని భయంతో బిక్కుబిక్కుమంటున్నం. ఇటీవలనే గ్రామంలో ట్రాక్టర్లకు ఏర్పాటు చేసిన సౌండ్ బాక్స్‌లు, డీజిల్ చోరీకి గురయ్యాయి. దాతలు, నాయకుల సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా మూలనపడ్డాయి.



– పొన్న కరుణాకర్, రామవరం

కమనీయం వేణుగోపాలుని కల్యాణం


వర్గల్ వేణుగోపాలుని కల్యాణోత్సవం ఘట్టం

వర్గల్(గజ్వేల్): కల్యాణ శోభతో వర్గల్ వేణుగోపాలుని కోవెల అలరారింది. సోమవారం రాత్రి వేణుగోపాలుని కల్యాణ మహోత్సవంతో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. ఉత్సవాలలో భాగంగా ఉద యం అర్చకులు కలశపూజ నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి మూల విరాట్టులను అభిషేకించి విశేషంగా అలంకరించారు. రాత్రి 10.30ని.లకు శ్రీవారి కల్యాణోత్సవ క్రతువు ప్రారంభించారు. అర్చక స్వాములు రుక్మిణి, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి వార్లకు ఎదుర్కోలు, యజ్ఞోపవిత ధారణ, సుముహర్త వేళ జిలకర బెల్లం, మంగళసూత్ర ధారణ చేశారు. కార్యక్రమంలో పురప్రముఖులు పాల్గొని తరించారు.

వెంకట్రావుపేటలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేటలో వేణుగోపాలస్వామి రుక్మిణి, సత్యభామ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీడికంటి రాజు పంతుల ఆధ్వర్యంలో రుత్వికులు ఉదయం హోమం చేపట్టారు. ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ తోడ్కొనివచ్చి ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు, ఏఎస్ఐ రాంరెడ్డి హాజరయ్యారు. మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, అంజమ్మ, లీలాదేవి, బీఆర్ఎస్ నేత రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు 33కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాడిచెర్లపల్లి, లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

గజ్వేల్‌రూరల్: విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సిలివేరు భిక్షపతికి చెందిన ఆవు తన పొలం వద్ద మేతమేస్తుండగా బోరు బావికి సంబంధించిన సర్వీస్ వైర్ తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు గాయపడిన ఘటన మండలంలోని గౌరవెల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరగోని నరసయ్యగౌడ్ ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మంద శ్రీనివాస్‌గౌడ్, పరశురాములు కోరారు.

ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలో ఎర్రబచ్చల మల్లేశం అక్రమంగా అదే గ్రామానికి చెందిన వంటేరు రాజిరెడ్డి ఖాళీ స్థలంలో నిల్వ చేసిన ఏడు ట్రాక్టర్ల ఇసుక డంపును సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని మద్దూరు పోలీసులకు అప్పగించారు. దూల్మిట్ట తహసీల్దార్ మధుసూదన్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సదాశివరావు పంచానామచేసి కేసు నమోదు చేశారు.

ఆలయ డైరెక్టర్‌కు సన్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మోహినిపుర వెంకటేశ్వర ఆలయ డైరెక్టర్‌గా నియమితులైన బైరి నాగమణిని బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రవీణ్, నాగరాజు, వెంకటేశ్, బాబు, యుగంధర్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండలంలోని తుక్కాపూర్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కాపూర్‌కు మొదటి విడతగా 25 ఇళ్లు మంజూరు చేశామన్నారు. గ్రామంలోని అర్హులందరికీ వారం రోజుల్లో ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళనకు గురికావద్దని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్నమాచార్య విగ్రహావిష్కరణ

మండలంలోని వెంకట్రావుపేటలో అన్నమాచార్య విగ్రహాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి కృషితో గ్రామంలో దళిత గోవిందం పథకంలో భాగంగా వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించారని అదే క్రమంలో గ్రామ కూడలిలో అన్నమాచార్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అక్కం స్వామి, కొండల్‌రెడ్డి, పోచయ్య, నారాయణ, కృష్ణాగౌడ్, ప్రవీణ్ కుమార్, నరేందర్‌రెడ్డి, రవీందర్, మహిపాల్‌రెడ్డి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అర్థవంతంగా బోధించడం అభినందనీయం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): భౌతిక రసాయనశాస్త్రంలోని కఠినమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించడం అభినందనీయమని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వట్టిపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. భౌతిక, రసాయనశాస్త్రంలోని వివిధ అంశాలను మహ్మద్ సాదత్‌అలీ 60 ప్రయోగ కృత్యాలను విద్యార్థులకు బోధించారు. జేవీవీ నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భవాని తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సహకరించండి**

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు రైతులు సహకరించాలని ఏడీఏ శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో ఏఈఓలు గ్రామాలకు వచ్చి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, రైతులు అవసరమై పత్రాలను అందించాలని చెప్పారు. మహ్మదాపూర్ రైతు వేదికలో మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దు**

గజ్వేల్‌రూరల్: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని సీఐ సైదా హెచ్చరించారు. గజ్వేల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఆరబోసిన ధాన్యం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారముందని, రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

◆ **విద్యార్థులకు అభినందనలు**

మద్దూరు(హుస్నాబాద్): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తస్మియ్య, ఐశ్వర్య, అశ్విని, రిషిక, శివానిని హెచ్ఎం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి అభినందించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన సభలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **నేడు అక్షరాస్యత, బడిబాటపై సమీక్ష**

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మండల ప్రత్యేకాధికారి అధ్యక్షతన అక్షరాస్యత, బడిబాటపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస వర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని హెచ్ఎంలు, సీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సీఏలు, ఏఏపీసీ చైర్మన్లు హాజరవ్వాలని కోరారు.

◆ **వైభవంగా హోమం, అభిషేకం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ హనుమాన్ దేవాలయంలో చిత్ర పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం వైభవంగా హోమం, అభిషేకాలు నిర్వహించారు. పురోహితుడు గొల్లపల్లి రమేశ్‌శర్మ సహకారంతో హనుమాన్ దీక్షా స్వాములకు అన్నప్రసాదం, పాలు పండ్ల అందజేశారు.

ఆధునిక సాగుపై అవగాహన అవసరం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


మాట్లాడుతున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం తోర్నాల, జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. సాగునీటి పొదుపు, రసాయన ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువులు, పొలాల గట్లపై చెట్ల పెంపకం, నేల స్వభావం, దుక్కుల దున్నడం, చీడ పీడలతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రవేత్తలు ఎల్.రాజా, శ్వేత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగులో ఎదుర్కొంటున్న సవాళ్లకు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కైలాసం, దుబ్బాక ఏడీఏ మల్లయ్య, హార్టికల్చర్ అధికారి రమేశ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మోహన్‌లాల్, మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఏఈఓలు రోహిత్, సమజాత, అనూష, మహేశ్, ఆస్మా, సాయి కుమార్, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ఏఐటీయూసీ, సీపీఐ నేతలు

మద్దూరు(హుస్నాబాద్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ ఆవిర్భవించిందని, వంద సంవత్సరాల నుంచి పేదల కోసం పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. మండలంలోని నర్సాయపల్లిలో సోమవారం సీపీఐ రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు ప్రాణాలర్పించి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా చేసి బానిసలుగా చేసే కుట్ర చేస్తుందన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన సుమారు 30 మంది ఏఐటీయూసీ, సీపీఐలో చేరారు. వారికి లక్ష్మణ్, అశోక్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పరికరాలు

వ్యవసాయ సహాయ సంచాలకుడు అనిల్


మహిళా రైతుకు మంజూరైన స్ప్రేయర్‌ను అందజేస్తున్న ఏడీఏ అనిల్

వర్గల్(గజ్వేల్): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తోందని ములుగు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అనిల్ తెలిపారు. వర్గల్‌లో పలువురు మహిళా రైతులకు రాయితీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వర్గల్, ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్ మండలాల రైతులకు రూ.10 లక్షల రాయితీతో కూడిన వివిధ పరికరాలు మంజూరయ్యాయన్నారు. అందులో 17 బ్యాటరీ స్ప్రేయర్లు, 17 తైవాన్ స్ప్రేయర్లు, 10 రోటవేటర్లు, 11 కల్టివేటర్లు, ప్లవ్స్, ఒక సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ ఉన్నాయని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక మొత్తంలో పరికరాలు అందే అవకాశం ఉందని, రైతులు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఓ శేషశయన, ఏఈఓ సంతోష్ పాల్గొన్నారు.

'ధూప దీప' పథకానికి దరఖాస్తుల ఆహ్వానం


కృష్ణ మోహన్

దుబ్బాకటౌన్: ఆలయాల్లో ధూప దీప నైవేద్యం సమర్పించే పథకానికిగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాయపోల్ తహసీల్దార్ కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ధూప దీప నైవేద్యం పథకానికి అర్హత కలిగిన ఆలయాలకు నెలకు రూ.4 వేలు, అర్చకులకు గౌరవభృతిగా రూ.6 వేలు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలోఅందజేయాలని కోరారు. అలాగే నాచారం లక్ష్మీనరసింహ దేవాలయానికి సంబంధించిన రామారం గ్రామంలోని 178 సర్వే నంబరుగల పది గుంటల భూమిని సంవత్సరం పాటు కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి డిపాజిట్ చేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీపీటీ పరీక్షలో వర్గల్ విద్యార్థుల ప్రతిభ


చైత్ర


దేవిప్రసన్న


రిషివర్ధన్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 5న నిర్వహించిన ప్రతిభాపాటవ పరీక్షలో ఐదో తరగతి చదువుతున్న ముగ్గురు వర్గల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సొప్పరి చైత్ర, మోతె దేవిప్రసన్న, దారం రిషివర్ధన్‌రెడ్డి హైదరాబాద్ ప్రగతినగర్ పాఠశాలకు ఎంపికయ్యారన్నారు. వారికి డిగ్రీ వరకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని చెప్పారు. అనంతరం ఆ విద్యార్థులు, కృషిచేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఉత్సాహంగా బండ్ల ఊరేగింపు


చండ్లాపూర్‌లో బండ్ల ఊరేగింపు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చండ్లాపూర్‌లో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లతో పాటు బైకులు, ట్రాక్టర్లతో ఊరేగించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు లో ఉపాధి హామీ కూలీలకు హుస్నాబాద్ షీ టీమ్ సభ్యులు సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాట్సప్‌లో వచ్చే ఎలాంటి లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. వేధింపులకు గురైతే మహిళలు మౌనం వీడి సమాచారం అందించాలని సూచించారు.